29052025-DIS-04_Layout 1 5/29/2025 1:55 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# చెక్కు చెదరని కీర్తి కాంతులు

**అబద్ధం** ఏనాటికైనా దూదిపింజల్లా తేలిపోతుంది. కానీ, సత్యం అశోక స్తంభంలా కాలాన్ని జయించి నిటారుగా నిలబడే ఉంటుంది. ఇది చరిత్ర తేల్చిన సత్యం. తెలంగాణ ప్రథమ సీఎం కేసీఆర్ పరిపాలన గురించి కాంగ్రెస్ పాలకులు ఎన్ని అవాకులు చవాకులు పేలితేనేం నిజం ఎగదన్నుకు వస్తున్నది. కేసీఆర్ దార్శనికత రాష్ర్టాన్ని ప్రగతి పరుగులు పెట్టించి అద్భుత విజయాలు సమకూర్చారని ఘంటాపథంగా చాటే నివేదికలు ఇంకా వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ (ఐసీఆర్ఏ) కొద్దిరోజుల కిందట విడుదల చేసిన 2025 నివేదిక ఇందుకు తాజా ఉదాహరణ. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తలసరి ఉత్పాదక విలువ వృద్ధి, అంటే గ్రాస్ స్టేట్ వ్యాల్యూ యాడెడ్ (జీఎస్వీఏ)లో తెలంగాణ సాధించిన అద్వితీయ విజయాలను ఆ నివేదిక మరోసారి ధ్రువీకరించింది. తెలంగాణ ఆవిర్భవించిన 2014లో జీఎస్వీఏ వృద్ధిలో 9వ స్థానానికి పరిమితమైన రాష్ట్రం 2023-24లో దేశ సగటునే అధిగమించి ప్రథమ స్థానానికి ఎగబాకడం మామూలు విషయం కాదు. వ్యవసాయం, ధాన్యం ఉత్పత్తి, పారిశ్రామికం, సేవారంగం, వాణిజ్యం, రియల్ ఎస్టేట్ రంగాల్లో 6 నుంచి 9 శాతం వృద్ధి సాధించింది. నీటి పారుదల రంగం ఏకంగా 26 శాతం పెరుగుదల నమోదు చేయడం విశేషం. ఒకప్పటి కరువు రాష్ట్రం ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్ వన్ స్థానానికి రాకెట్‌లా దూసుకుపోయింది. ఈ అభివృద్ధి అంతా కూడా నీటిపారుదల చుట్టే అల్లుకోవడం విశేషం.

సాగు రంగంలో కొత్త శిఖరాలకు చేరుకున్నాం. అదే సమయంలో పారిశ్రామికంగానూ రాష్ట్రం వెలుగుబాట పట్టింది. తెలంగాణ సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు 6.5-6.9 శాతంగా నమోదైనట్టు ఐసీఆర్ఏ నివేదిక వెల్లడించింది. ఇది జాతీయ సగటు 5.7 శాతం ఎక్కువగా ఉండటం గమనార్హం. వాణిజ్య విభాగంలో 9 శాతం, రియల్ ఎస్టేట్ రంగంలో 8 శాతం, రవాణా రంగంలో 7 శాతం వృద్ధిని సాధించి జాతీయంగా 'అవ్వల్ దర్జా'కు చేరింది. ఐఆర్‌సీఏ ఒక్కటే వీటిని నిర్ధారించలేదు. 2024-25 ఆర్థిక సర్వే, ఆర్బీఐ హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ వంటి ఇతర అత్యంత విశ్వసనీయ నివేదికలూ ఈ గణాంకాలనే వెలువరించాయి. కేసీఆర్ అవధులు లేని దార్శనికత, అసమాన ప్రణాళికా సామర్థ్యం, అద్వితీయమైన పరిపాలనా నైపుణ్యం ఈ విజయాలకు కారణం. సంపద పెంచడం, నలుగురికీ పంచడం అనే తాత్త్వికత ఫలితంగా రాష్ట్రం ముఖచిత్రమే మారిపోయింది. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడుగుర్రాలుగా పరుగెత్తించిన కారణంగా అన్నివర్గాలు సంతోషించే మంచిరోజులు వచ్చాయి.

కానీ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రగతి పరుగులకు బ్రేకులు పడ్డాయి. పరిపాలనపై అవగాహన లేక, ఆర్థిక నిర్వహణ చేతకాక చతికిలపడుతున్న ఫలితంగా రాష్ట్రం తిరోగమన దిశగా వెళ్తున్నది. జీఎస్పీ వృద్ధి రేటు 0.94 శాతం పడిపోవడం, తలసరి ఆదాయం వృద్ధి రేటు 4.5 శాతం తక్కువగా నమోదైంది. జీఎస్టీ వసూళ్లు తగ్గిపోయాయి. రవాణారంగం రాబడి వేగం తగ్గింది. ఇక రియల్ ఎస్టేట్ రంగం నేలచూపులు చూస్తున్నది. లెక్కలు అప్పుడు తీసినా, ఇప్పుడు తీసినా అంకెల విలువ మారదు. ఒకటి ఒకటే, సున్నా సున్నాయే. అద్దం అబద్ధం చెప్పదు. రాష్ట్రం సాధించిన అభివృద్ధికి నివేదికలు జేజేలు కొడుతుంటే, రాష్ర్టాన్ని దివాళా తీయించారని, ఖాళీ ఖజానా చేతికిచ్చారని పిచ్చిమాటలతో కాలక్షేపం చేస్తున్నది కాంగ్రెస్ సర్కారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటింది. ఇంకా సీఎం రేవంత్‌రెడ్డికే తాను సీఎంననే భావన కలుగడం లేదు. ఇక ప్రజల సంగతి చెప్పేదేముంది? వారు నిరంతరం కేసీఆర్ పాలన స్వర్ణయుగాన్నే నెమరు వేసుకుంటున్నారు.

# మనతనం కలకాలం నిలవాలి



ఆర్ఆర్ఆర్

**1951లో తెలంగాణ సాయుధ ఉద్యమం, 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమం, 2001లో మలిదశ తెలంగాణ ఉద్యమం జరిగింది. అయితే నిజాం నిరంకుశ పాలనా విముక్తి నుంచి 2000 వరకు ఆంధ్ర పాలకుల కబంధ హస్తాల్లో తెలంగాణ కొట్టుమిట్టాడింది. దశాబ్దాల తరబడి దగా పడుతున్న ఈ తెలంగాణకు విముక్తి కల్పించేందుకు స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) 2001, ఏప్రిల్ 27వ తేదీన జలదృశ్యంలో ఆవిర్భవించింది. అయితే, 1969 నుంచి తెలంగాణ సాధన కోసం 20కి పైగా పార్టీలు పుట్టినప్పటికీ, అవి స్వరాష్ర్టాన్ని సాధించలేకపోయాయి. టీఆర్ఎస్ మాత్రం అందుకు భిన్నంగా రాజీలేని పోరాటం చేసి నాలుగు కోట్ల ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ర్టాన్ని సాకారం చేసింది.**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన రాజకీయ భవిష్యత్తును సైతం పణంగా పెట్టి, చట్టసభల్లో పదవులను తృణప్రాయంగా త్యజించిన అరుదైన నాయకుడు కేసీఆర్. రాష్ట్ర సాధన ఒక్కటే తెలంగాణ కష్టాలకు పరిష్కారమని నమ్మిన కేసీఆర్ ప్రజలను ఒప్పించడంలో సఫలీకృతమయ్యారు. తెలంగాణ ఉద్యమంలో వారిని భాగస్వాములను చేశారు. చాలామంది ఉద్యమ కారులు, విప్లవకారులు, ప్రాంతీయ పార్టీలు మొదలు చాలామంది వ్యక్తులు, సంస్థలు తుపాకీ గొట్టం ద్వారానే తెలంగాణ సాధిస్తామని ప్రకటించాయి. శత్రువును పారద్రోలాలంటే దండయాత్రనే శరణ్యమని, 'ఈట్‌కా జవాబ్ పత్తర్‌సే దేంగె' అని శపథాలు చేశాయి.

అయినా వాటితో సాకారం గాని స్వరాష్ట్ర సాధన ఒక్క కేసీఆర్‌తో సాధ్యమైంది. ముఖ్యంగా కవులు, కళాకారులు, సాహితీ వేత్తలందరికీ ఒక వినూత్న చారిత్రక ఉద్యమ నిర్మాణం చేసే వేదికలో వీళ్లందరిని ఒకేతాటిపై నడపించడంలో కేసీఆర్ దాదాపు దశాబ్దన్నర కాలం ఎన్నో కష్టాలు పడ్డారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. తెలంగాణ వ్యతిరేకులను వంచేందుకు ఆయన ఎంచుకున్న బ్రహ్మాస్త్రం అహింసాయుద్ధం.

2014, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తెలంగాణ పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 'మిషన్ భగీరథ', 'మిషన్ కాకతీయ' వంటి బృహత్తర పథకాలతో రాష్ట్రంలో సాగు, తాగునీటికి కరువు లేకుండా చేశారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించి నిధులకు కొదువలేకుండా చేశారు. అధికార వికేంద్రీకరణ కోసం జిల్లాలను పెంచారు. జిల్లాలలో దేనికీ కొదువ లేకుండా జిల్లా కార్యాలయాల సముదాయాలను నిర్మించారు.



**ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా నిరుద్యోగ సమస్య తీర్చారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన ఉద్యమ లక్ష్యం నెరవేరే విధంగా బృహత్తరమైన కార్యాచరణ తీసుకున్నారు. అందులో భాగంగానే సాగునీటి రంగ అభివృద్ధిలో తెలంగాణ ప్రణాళికలు దేశానికే దిక్సూచిగా నిలిచాయి. ముఖ్యంగా తెలంగాణ సాగునీటి రంగానికి ఊతమిచ్చేందుకు సాహసోపేతమైన అనేక చర్యలు కేసీఆర్ తీసుకున్నారు. అలా సాగునీటి పారుదలకు అగ్రస్థానం ఇవ్వటంతో గత తొమ్మిదేండ్ల వ్యవధిలో రాష్ట్ర నీటి పారుదల రంగం అత్యున్నత స్థితికి చేరుకున్నది.**

తెలంగాణ సస్యశ్యామలం కావాలని ప్రజలు తాగు, సాగునీటి కోసం అలమటిస్తున్న పరిస్థితిని చూసి స్వరాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ దాహార్తిని తీర్చడం కోసం ఎన్నో మైలురాళ్లను దాటారు. నీటి ప్రాజెక్టులను నిర్దేశించుకున్న వ్యవధిలో పూర్తి చేసేందుకు పడ్డ తపన అంతా ఇంతా కాదు. ఆ క్రమంలో ఎన్నో సమావేశాలు, కార్యక్రమాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ముందుండి నిర్వహించారు. సాగునీటి ప్రాజెక్టులు శరవేగంగా పూర్తయ్యేవరకు వ్యూహాత్మక చర్యలు తీసుకున్నారు. ఫలితంగా ప్రాజెక్టులన్నీ అనతికాలంలోనే పూర్తయ్యాయి. అలాగే పాత ప్రాజెక్టులను కూడా విప్లవాత్మక రీతిలో ఆధునీకరించటం వల్ల సాగునీటిరంగ విస్తీర్ణం పెరిగింది. తెలంగాణ గణాంక నివేదిక ప్రకారం సాగునీటి విస్తీర్ణం 2014లో 62 లక్షల 48 వేల ఎకరాలుండగా 2023 నాటికి 1 కోటి 35 లక్షల 60 వేల ఎకరాలకు పెరగడం ఆయన దీక్షా దక్షతకు నిదర్శనంగా భావించక తప్పదు.

అదేవిధంగా అడవులనూ 27 శాతం పునరుద్ధరించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వగైరా ప్రోత్సాహకాలతో వ్యవసాయరంగాన్ని పరుగులు పెట్టించారు. కేసీఆర్ కృషిఫలితంగా దేశంలోనే అత్యధికంగా వడ్లను పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిన తీరును మనం కండ్లతో చూశాం. దేశ రాజకీయాలను తెలంగాణ రాజకీయాలతో పోల్చి చూసినట్టయితే, భారత్‌లో నూతన ఆర్థిక విధానాలు ప్రవేశించిన 1990వ దశకం నుంచి ఆర్థిక అసమానతలు ఆకాశాన్నంటుతూ వచ్చాయి. ఎన్నో ప్రగల్బాలు పలికి గద్దెనెక్కిన మోదీ సర్కార్ పెత్తందారులకే కొమ్ము కాస్తూ, మతపరమైన విద్వేషాలతోనే కాలం గడుపుతున్నది. కోటీశ్వరులు ప్రపంచ కుబేరులుగా ఎదుగుతుంటే, కోట్ల మంది పేదలు నిరుపేదలవుతున్నారు. అతిపెద్ద ఆర్థికవ్యవస్థలో ఐదో స్థానానికి భారత్ ఎదగడం, సామాన్యుల జీవన ప్రమాణాల గణాంకాల్లో 134వ స్థానానికి దిగజారడం అందుకు ఉదాహరణ. ప్రపంచ కుబేరుల రీత్యా పదో స్థానానికి ఎగబాకిన భారత్ పేదరికాన్ని నిర్మూలించుకున్న జాబితాలో 113వ స్థానంలో నిలిచింది. ఇవన్నీ రాజకీయ లెక్కలు కావు. ప్రపంచ బ్యాంకు, తదితర సంస్థల సర్వేలు, ఐరాస అధికార నివేదికలు చెప్పున్న కఠోర వాస్తవాలు.

**రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి సుమారు ఏడాదిన్నర కావస్తున్నది. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు నెరవేర్చకపోగా పరిపాలన గాడి తప్పుతున్నదని, ప్రజలు అభద్రతాభావంలో ఉన్నారన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక్కో రంగం సంక్షోభంలో కూరుకుపోతున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు నాలుగు హామీలిచ్చింది.**

రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15,000, వడ్లకు రూ.500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల సాయం ఈ నాలుగు హామీల్లో కనీసం ఒక్కటి కూడా అమలు చేయలేకపోయింది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు లెక్క ప్రకారం ఇవ్వవలసిన నిధులు ఇవ్వకున్నా నిధుల కొరతతో కటకటలాడుతున్నా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ బీజేపీ పాలనను పల్లెత్తు మాటైనా అనటం లేదు. తెల్లవారితే చాలు ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్‌ను విమర్శిస్తూ ఇష్టమొచ్చినట్టు దూషిస్తూ ఢిల్లీకి సంచులు మోస్తున్నడు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా.. 'రాష్ట్రం దివాలాలో ఉన్నది. నన్నేం చేయమంటారు. నన్ను కోసుకొని తినండి' అనటంతో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే వ్యవసాయదారుల నుంచి, ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర తిరుగుబాటును చవిచూస్తున్నది.

**బీఆర్ఎస్ రజతోత్సవ సభతో అర్థమైన విషయమేమంటే ప్రజాపాలనపై తెలంగాణ ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నది స్పష్టమైంది. ఈ అసంతృప్తి అసమ్మతిలోకి మారేలోపు కాంగ్రెస్ పార్టీ జాగ్రత్త పడుతుందా లేదా అనేది పక్కనపెడితే మళ్లీ కేసీఆర్ పాలన ఉంటే ఇలా జరిగేది కాదంటున్నారు ప్రజలు.**

అయితే ఇటీవల జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభతో అర్థమైన విషయమేమంటే కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నది స్పష్టమైంది. అయితే ఈ అసంతృప్తి అసమ్మతిలోకి మారేలోపు కాంగ్రెస్ పార్టీ జాగ్రత్త పడుతుందా లేదా అనేది పక్కన పెడితే కేసీఆర్ పాలన ఉంటే ఇలా జరిగేది కాదంటున్నారు ప్రజలు. మళ్లీ ఆయనే కావాలని తెలంగాణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నది తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో కనీవినీ ఎరుగని రీతిలో సోషల్ మీడియా, వివిధ మాధ్యమాల్లో వదంతులు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో జననేత కేసీఆర్ కృషిని గుర్తుచేసుకోకతప్పదు. స్వరాష్ర్టాన్ని ఆవిర్భవింపజేయడమే కాదు, తెలంగాణ ఆత్మను ఆయన ఆవిష్కరించాడు.

'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని శ్రీ శ్రీ అన్నట్టుగా మనం కూడా మనతనం ఉన్నవాళ్లను దూరంపెట్టి పరాయిలను అక్కున జేర్చుకోవడం మహాపాపం. మొన్నటి రజతోత్సవ సభలో మనతనం కనపడింది. ఆ నిండుతనం అలానే కొనసాగిస్తే రానున్నకాలంలో జనాదరణ మెండుగా చూరగొనవచ్చుననడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా మాయమాటల మోసగాళ్లను దరిచేరనియకుండా మనతనం ఉన్నవాళ్లను గుర్తిస్తే మన పురోగమనం నిరాఘాటంగా సాగుతుందనేది కాదనలేని సత్యం.



# ప్రపంచ యవనికపై గులాబీ జెండా



నాగరాజు గుర్రాల

**2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సాకారమైనప్పుడు గులాబీ జెండా సగర్వంగా ఎగిరింది. రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన బీఆర్ఎస్ నేతృత్వంలోని కేసీఆర్ ప్రభుత్వం పలు సవాళ్లను అధిగమించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పలు సంక్షేమ పథకాలను అమలుచేసింది.**

'రైతుబంధు'.. ఈ పథకం రైతులకు పెట్టుబడి సహాయ పథకం, వారికి ఆర్థిక భరోసాను అందించింది. అంతేకాదు, దేశానికే ఆదర్శంగా నిలిచింది. 'రైతు బీమా'.. అనుకోకుండా రైతు మృతిచెందితే అతని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే పథకం. 'మిషన్ భగీరథ'... ప్రతి ఇంటికీ సురక్షిత తాగు నీరు అందించే లక్ష్యంతో అమలైన బృహత్తర పథకం. 'మిషన్ కాకతీయ'.. చెరువుల పునరుద్ధరణ ద్వారా సాగునీటి సామర్థ్యాన్ని పెంచిన కార్యక్రమం.'కాళేశ్వరం ప్రాజెక్టు'.. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. తెలంగాణ వ్యవసాయానికి ఈ ప్రాజెక్టు నీటి భరోసా కల్పించింది. ఇలా ఎన్నో రైతు సంక్షేమ పథకాలను గత బీఆర్ఎస్ అమలుచేసింది. రాష్ట్రంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, జీవన ప్రమాణాలను మార్చాయి. తద్వారా బీఆర్ఎస్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇతర రాష్ర్టాలకు స్ఫూర్తిగా మారింది.

మాజీ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ఐటీ రంగం పురోగమించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ప్రపంచస్థాయి ఐటీ హబ్‌గా రూపాంతరం చెందింది. ఆయన ప్రవేశపెట్టిన వినూత్న విధానాలు తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా మార్చాయి.

- **టీఎస్-ఐపాస్:** హైదరాబాద్ పెట్టుబడిదారులకు వేగవంతమైన అనుమతులు, సులభతరమైన వ్యాపార వాతావరణాన్ని కల్పించింది.
- **ఇన్నోవేషన్ హబ్‌లు:** స్టార్టప్‌లు టెక్ కంపెనీలకు ప్రోత్సాహం అందించే సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్.
- **గ్లోబల్ టెక్ హబ్:** మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను స్థాపించాయి. ఈ కృషి ఫలితంగా, హైదరాబాద్ లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలను సృష్టించింది. యువతకు నూతన ఆత్మవిశ్వాసం, స్టార్టప్ కల్చర్‌కు ఊపిరి, రాష్ట్ర ఆర్థికవృద్ధికి బలమైన పునాదిని వేసింది. కేటీఆర్ నాయకత్వం తెలంగాణను ప్రపంచపటంలో ఒక బ్రాండ్‌గా నిలిపింది.

**తెలంగాణ ఉద్యమం రాష్ట్ర సరిహద్దులకే పరిమితం కాలేదు, ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా ప్రపంచ నలుమూలల నుంచి ఎన్నారైలు ఈ ఉద్యమానికి బలమైన మద్దతును అందించారు. ఆర్థిక సహాయం, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ గొంతుకను బలంగా వినిపించడం ద్వారా ఎన్నారైలు ఈ ఉద్యమాన్ని గ్లోబల్ స్థాయికి తీసుకువెళ్లారు.**

బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకొని, 2025, జూన్ 1న అమెరికాలోని డాలస్ నగరంలోని DR Pepper వేదికగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) హాజరుకానున్నారు. కేటీఆర్ ఒక గ్లోబల్ ఇన్ఫ్లూయెన్సర్‌గా, భవిష్యత్తు తెలంగాణకు జెండాదారుగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వం తెలంగాణ ఆశయాలను ప్రపంచ వేదికపై మరింత ఉన్నతంగా నిలబెడుతున్నది. అదే విధంగా సౌతాఫ్రికాలో 2025, ఆగస్టులో జరిగే రజతోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ సౌతాఫ్రికా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరుగనున్నాయి. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి మేము సౌతాఫ్రికాలోని అన్ని సమాజ సంస్థలతో సమన్వయం చేస్తున్నాం. సౌతాఫ్రికా ఎన్నారై అధ్యక్షుడిగా నాకు లభించిన ఈ బాధ్యత ఒక గౌరవం మాత్రమే కాదు, బీఆర్ఎస్ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకానికి సంకేతం. ఈ అవకాశం కేసీఆర్ దూరదృష్టి వల్లే సాధ్యమైంది.

బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు గత విజయాల స్మరణ కాదు; అవి భవిష్యత్తును ముందుకు సాగే సందర్భం. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఎదుర్కొంటున్న సవాళ్లు, అవినీతి, అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం, ప్రజల ఆశలను నీరుగార్చే విధానాలను ఎండగడుతాయి. తద్వారా మరోసారి బీఆర్ఎస్ శ్రేణులను ఉద్యమించేందుకు పిలుపునిస్తున్నాయి. రాష్ట్రం మళ్లీ అగాథంలోకి జారిపోకుండా, ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ శ్రేణులను సిద్ధం చేస్తుంది. కేసీఆర్, కేటీఆర్ దూరదృష్టితో, తెలంగాణ ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చి రాష్ర్టాన్ని దేశానికే ఆదర్శంగా నిలబెడుతుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం. బీఆర్ఎస్ రజతోత్సవం రాజకీయ పార్టీ వేడుక కాదు, ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, పోరాటం, అభివృద్ధి సమగ్ర ప్రయాణం. డాలస్ నుంచి సౌతాఫ్రికా దాకా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నారైలు నిర్వహించే ఈ వేడుకలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటుతున్నాయి. ఈ సందర్భం తెలంగాణ యువతకు, రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజానికి ఒక సందేశాన్నిస్తున్నాయి. తెలంగాణ అంటే ఒక రాష్ట్రం కాదు; అదొక భావోద్వేగం, అదొక ఐక్యత, అదొక గ్లోబల్ గుర్తింపు. బీఆర్ఎస్ రజతోత్సవం తెలంగాణ భవిష్యత్తు పట్ల విశ్వాసాన్ని, పార్టీ నాయకత్వం పట్ల నమ్మకాన్ని పెంపొందిస్తుంది. ఇదొక జ్ఞాపకం కాదు; రేపటి తరాలకు స్ఫూర్తినిచ్చే ఒక విజయగాథ. తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ మరోసారి ప్రజల ఆశయాలకు నీరాజనం పట్టాలి. ఇదే ఈ రజతోత్సవ సందేశం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ సౌతాఫ్రికా ఎన్నారై అధ్యక్షుడు)

# ఎటు వెళ్తున్నది ప్రజాస్వామ్యం?




ఆకార్ పటేల్

**ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు, అది మౌలికంగా వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం గురించి నిర్వచిస్తుంది. సామాజిక నియమాలు, సంస్కృతి ఏ ప్రభుత్వంలోనైనా ఉండొచ్చు. కానీ, ప్రజాస్వామ్యం, దాని సంస్కృతి, ఆచరణ, స్ఫూర్తి మాత్రం ఒక దేశాన్ని, ఆ దేశంలోని వ్యక్తులను సాధికారికం చేయడం ద్వారా వారి ఉన్నతికి, ఉద్ధరణకు తోడ్పడాలి. అదే ప్రజాస్వామ్యం ప్రధాన ఉద్దేశం.**

ప్రముఖ రచయిత సి.ఎస్ లూయిస్ రాసిన ఓ వ్యాసంలో ఇలా చెప్పారు. 'ఏ వస్తువును అయినా, రచనను అయినా విమర్శించేందుకు మొదటి అర్హత ఏమిటంటే.. ముందుగా దాని గురించి తెలుసుకోవడం. అది కార్క్ స్క్రూ అయినా కావచ్చు, పవిత్ర స్థలం అయినా కావచ్చు. దాని ఉద్దేశమేమిటి? దాన్ని ఎలా ఉపయోగించాలో తొలుత తెలుసుకోవాలి. ఆ తర్వాత దాన్ని చెడు ఉద్దేశం కోసం తయారు చేశారని నిర్ణయానికి రావచ్చు. మీకు తెలియనంత వరకు దాని గురించి సరిగ్గా చెప్పలేరు, విమర్శించలేరు'.

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమేనని భావించడం తప్పు. ప్రజాస్వామ్యమంటే ఓట్లు వేయడం, నాయకులను ఎన్నుకోవడం మాత్రమే కాదు. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం అణచివేస్తే నిరంకుశత్వ ప్రభుత్వానికి, ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వానికి మధ్య ఎలాంటి తేడా ఉండదు. ఎందుకంటే, రెండింట్లోనూ భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యాన్ని అడ్డుకోవడం, ప్రజాభిప్రాయాన్ని నియంత్రించడం, నియంతలాగా ఏక వ్యక్తి ఆలోచనలు అమలు చేయడమే జరుగుతుంది.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా న్యాయమూర్తి తీర్పు ఇవ్వడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో వ్యక్తుల స్వాతంత్ర్యాన్ని రక్షించేందుకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిలబడే అధికారం న్యాయమూర్తికి ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ నిరంకుశత్వం నుంచి వ్యక్తులను న్యాయమూర్తి విముక్తి చేయాలి.




**ప్రభుత్వం ఎప్పుడూ వ్యక్తులను నియంత్రించాలనే చూస్తుంది. ప్రభుత్వ నిర్ణయాలు కూడా ఆ దిశలోనే ఉంటాయి. ఎందుకంటే, వ్యవస్థకు ఎల్లప్పుడూ వ్యక్తి స్వేచ్ఛ అడ్డంకిగా అనిపిస్తుంది. పైన చెప్పిన వ్యాఖ్యల అర్థం, పరమార్థాన్ని మీరు మన దేశంలో జరిగిన, జరుగుతున్న ఏదేని ఘటనతో పోల్చి చూసుకోవచ్చు. ఏదైనా ఒక్క ఘటన గురించి మాట్లాడటం కంటే, ఒక రచయితగా మన దేశం ఎటు వెళ్తున్నదో, దేశంలో ఎలాంటి మార్పులు సంభవిస్తున్నాయనే అంశాలపైనే ఎక్కువ ఆసక్తి ఉంటుంది.**

ప్రభుత్వం చేస్తున్న మార్పుల (చట్టాలు) వల్ల సాధారణ ప్రజానీకం ఎలా ప్రభావితమవుతున్నదో, ఆ మార్పుల పట్ల ఎలా స్పందిస్తున్నదో గమనిస్తుంటాం. అయితే, ఇప్పుడు వాటి గురించి వివరించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, అవి చాలా కాలం నుంచి (ఈ ప్రభుత్వ పాలనలో మనం ఇప్పటికే 12వ సంవత్సరంలో ఉన్నాం) జరుగుతూనే ఉన్నాయి. ప్రజామోదం కూడా పొందాయి. ఆసక్తి ఉంటే వివరాలను పరిశీలించి ఇక్కడ జరుగుతున్నది వ్యక్తి సాధికారతను, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందా? లేదా దానికి విరుద్ధంగా ఉందో ఒక అంచనాకు రావచ్చు. ప్రభుత్వం మనల్ని ఒక నిర్దిష్ట దిశలో నడిపిస్తున్నది. ప్రస్తుత పాలనలో చాలా కాలం నుంచి మనం నిస్సారమైన పరిస్థితుల్లో వదిలివేయబడ్డాం. చట్టాల ద్వారా ఆ దిశ మనకు వెల్లడవుతుంది.

| అలాంటి కొన్ని చట్టాలు | మరికొన్ని |
| --- | --- |
| ఉత్తరాఖండ్ మత స్వేచ్ఛా చట్టం 2018 | మహారాష్ట్ర జంతు సంరక్షణ చట్టం 2015 |
| హిమాచల్ ప్రదేశ్ మత స్వేచ్ఛా చట్టం 2019 | హర్యానా గోవంశ్ సంరక్షణ్ అండ్ గోసంవర్ధన్ చట్టం 2015 |
| ఉత్తరప్రదేశ్ విధి విరుద్ధ్ ధర్మ సంపరివర్తన్ ప్రతిబంధ్ అధ్యాదేశ్ 2020 | గుజరాత్ జంతు సంరక్షణ (సవరణ) చట్టం 2017 |
| మధ్యప్రదేశ్ మత స్వేచ్ఛా చట్టం 2021 | ఆర్బీఐ చట్టాలు (సవరణ) 2019 |
| గుజరాత్ మత స్వేచ్ఛా చట్టం 2021 | ఆధార్, ఇతర చట్టాలు (సవరణ) 2019 |

**వీటిలో సంవత్సరాలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే, సంవత్సరాలవారీగా ఈ చట్టాలు ఒక దిశను చూపుతున్నాయి. ఈ రోజు మనం ఉన్న స్థితికి అవి మనల్ని తీసుకొచ్చాయి. వార్తా కథనాలను ఆక్రమించే ఘటనల వెనుక ఇప్పుడు చట్టం ద్వారా అమల్లో ఉన్న ఈ నిర్మాణం ఉంది. ఈ నిర్మాణం దృఢంగా మారిపోయింది.**

మీరు బాగా సమర్థవంతంగా నిర్వహిస్తున్న నిరంకుశత్వాన్ని కలిగి ఉండొచ్చు. ప్రపంచవ్యాప్తంగా, మన పొరుగు దేశాల్లో నిరంకుశత్వ ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. వ్యక్తి తనకు ఇష్టం ఉన్నా, లేకున్నా స్వా తంత్ర్యం, స్వేచ్ఛను వదులుకోవాల్సి ఉంటుంది.

వ్యవస్థాగత అణచివేతలో వికసించే ప్రజాస్వామ్య ఉదాహరణలు మనకు ఎక్కడా కనిపించవు. స్వేచ్ఛను ఇవ్వడం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్య ఫలాలు అందుతాయి, అణచివేత ద్వారా కానే కాదు. స్వేచ్ఛ ఉన్న వ్యక్తి మరింత ఉత్పాదకతతో, సృజనాత్మకంగా, సామర్థ్యంతో ఉంటాడని గుర్తించాలి. ఇందుకు విరుద్ధమైన మార్గం విజయం వైపు దారితీయదు. స్వేచ్ఛను అణచివేయడం ద్వారా విజయం సాధించలేం. విజయమంటే వ్యక్తులు, సమూహాలను వ్యవస్థాగతంగా, అనవసరంగా అడ్డుకోవడం, తద్వారా ఆనందించడం కాదు.